


సర్కారు బడులకు జీవం!

- ప్రభుత్వ స్కూళ్లలో పరిశుభ్రతను పెంచేలా కార్యాచరణ
- ఎస్ఎస్‌పి ద్వారా విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధి, రక్షణే ధ్యేయం
- పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక సమావేశాలు
- పాఠశాలల్లో ఈ నెల 25 వరకు అమలు 6

దీపం.. కార్తీక శోభితం



ఖమ్మం గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో...

- ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు
- కాంతులీనిన ఆలయాలు
- శివయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు
- సాయంత్రం ఘనంగా జ్వాలాతోరణం

వివరాలు : 7లో



ఖమ్మంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం



భద్రాచలం వద్ద గోదావరిలో భక్తుల కార్తీక స్నానాలు



కూసుమంచి మండలం జీళ్లచెరువులో సీతారాముల తెప్పోత్సవం



ఖమ్మం గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

'చుక్కల'కు చిక్కులు!



- దుప్పులకు కరువైన రక్షణ
- మృత్యువాత పడుతున్న అడవి జంతువులు
- మూడేళ్ల క్రితం 350ఎకరాల్లో అర్బన్ పార్క్ ఏర్పాటు
- ప్రహరీ ఎత్తు పెంచితే ప్రమాదాల నివారణ
- సింగరేణి బాంబ్ బ్లాస్టింగులే కారణమంటున్న అధికారులు

సత్తుపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'చుక్కల' దుప్పులు చిక్కుల్లో పడుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో వేటగాళ్ల ఉచ్చులతో పాటు విద్యుత్ తీగలనూ అమర్చడంతో.. ప్రతీ యేడు పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. ఇది చాలదన్నట్టు అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లో వస్తూ.. రోడ్డు ప్రమాదాల బారిన పడి కూడా చనిపోతున్నాయి తాజాగా ఆదివారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన చుక్కల దుప్పి.. మృత్యుఒడికి చేరింది. అదే రోజు పార్క్ లోపల మరో దుప్పి తీవ్ర అస్వస్థతకు లోనవ్వగా.. వాకర్స్ సమాచారం ఇవ్వడంతో పశు వైద్యాధికారులు సకాలంలో వైద్యం అందించడంతో ప్రస్తుతం పరిస్థితి మెరుగ్గా ఉంది. అయితే మూడేళ్ల క్రితం స్థానిక వేంసూర్ రోడ్‌లో సుమారు 350ఎకరాలలో అటవీ ప్రాంతంగా మలిచి నిర్మించిన నీలాద్రి అర్బన్ పార్క్‌లో వందల కొద్దీ దుప్పులు ఉన్నాయి. అంతకుముందు నుంచి కూడా సత్తుపల్లి పరిసర ప్రాంతాలతో పాటు ముఖ్యంగా సింగరేణిలో పనులు జరుగుతున్న ప్రాంతం, పరీవాహక ప్రాంతంలో దుప్పులు అప్పుడప్పుడు మృత్యువాతకు గురయ్యేవి. ఇందులో కొన్ని వేటగాళ్ల ఉచ్చులకు బలవ్వగా.. మరికొన్ని వీధి కుక్కలు వెంటపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాయి. మూడేళ్ల (మిగతా 6వ పేజీలో)



ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైన చుక్కల దుప్పి



గాయపడిన దుప్పిని తరలిస్తున్న సిబ్బంది, వాకర్స్ (ఫైల్)

హై స్పీడ్‌కు అడ్డేదీ?

- ప్రమాదాలకు కారణమవుతున్న వాహనాల అతివేగం
- దూసుకొస్తున్న మట్టి, కంకర, ఇసుక టిప్పర్లు
- డేంజర్‌గా మారిన గ్రానైట్ రాళ్ల తరలింపు లారీలు



నగరంలో అధిక లోడ్‌తో వెళ్తున్న లారీ

ఖమ్మం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రానైట్.. ఇసుక.. కంకర.. మొరం.. ఇలా ఖనిజ సంపద తరలింపునకు వినియోగిస్తున్న వాహనాలు ప్రజల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. ఎప్పుడు ఎటు వైపు నుంచి దూసుకొస్తాయో తెలియక ప్రాణాలరచేత పట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వాహనాల హైస్పీడ్‌ను అడ్డు లేకపోతుండటంతో నిత్యం ఎక్కడో ఓ చోట ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. వీటి వేగనియంత్రణపై రవాణా, పోలీసు, మైనింగ్‌శాఖల అధికారులు దృష్టిపెట్టకపోతుడటంతో ఆయా వాహనాల యజమానులు, డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలు రకాల ఖనిజ సంపదకు నిలయమైన ఉమ్మడి ఖమ్మంజిల్లాలో లభించే లభిస్తున్న గ్రానైట్ దేశ విదేశాలకు ఎగుమతువుతుండగా.. రాష్ట్రంలోని పొరుగు జిల్లాల నుంచి కూడా గ్యాంగ్సాలు భారీ లారీలతో ఖమ్మం- తిరుమలాయపాలెం, ఖమ్మం - వరంగల్, ఖమ్మం - సత్తుపల్లి రహదారులపై రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం 100వరకు భారీవాహనాలు అధిక టన్నేజీతో కాకినాడ, విశాఖ, మచిలీపట్నం పోర్టులకు సరుకు రవాణా చేస్తున్నాయి. ట్రాలీ లారీ ఎక్కడైనా గోతిలోపడినా, ఏదైనా ఎదురుగా ఢీకొన్న ఆ బండరాళ్లు పడితే పెనుప్రమాదమే జరుగుతుంది.

అడ్డగోలు పార్కింగ్‌తోనూ ప్రమాదాలు..

రాత్రివేళ భారీ గ్యాంగ్సాలతో హైవేలపై రవాణా చేస్తున్న వాహనాలను కొన్నిచోట్ల దాబా హోటళ్లతో పాటు పలు ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. రాత్రిపూట పోలీసులు పెట్రోలింగ్ చేసి కేసులు పెట్టకపోవడంతో రోడ్లపక్కల, మద్యంషాపుల సమీపంలో, హోటళ్ల సమీపంలోనే పెట్టి తమ కార్యక్రమాలు పూర్తి చేసుకువస్తున్నారు. జిల్లాలో పెద్దఎత్తున గ్రానైట్ భారీవాహనాలు వెళుతున్నా తూతూమంత్రంగా కేసులు నమోదుచేయడం తప్ప నిరంతర తనిఖీలు జరగడంలేదు. అలాగే గోదావరితో పాటు మున్నేరు, కిన్నెరసాని తదితరచోట్ల నుంచి వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి.

తప్పుడు పత్రాలు.. అధిక లోడు..

మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, తదితరప్రాంతాల నుంచి కొన్ని వేబిల్లుపై వస్తుండగా మరికొన్ని తప్పుడుప్రత్రాలతో భారీ టన్నేజీతో పాటు ఇసుక ఖమ్మంతోపాటు, హైదరాబాదు సూర్యాపేట తదితర ప్రాంతాలకు ఎగుమతవుతుంది. ఏపీకి చెందిన ఇసుక కూడా సత్తుపల్లి, మధిర మీదుగా కూడా టిప్పర్లు, లారీలతో ఎగుమతి చేస్తున్నారు. దీంతో పాటు జిల్లాలో పెద్దఎత్తున కంకర, గ్రావెల్ టిప్పర్లు కూడా తిరుగుతున్నాయి. నేషనల్ హైవే రహదారుల నిర్మాణంతో పాటు ఇతర అవసరాల కోసం క్వారీలనుంచి కొన్ని అనుమతితో తిరుగుతుండగా.. కొన్ని అనధికారికంగా తిరుగుతున్నాయి. అధికలోడు, అధికవేగంతో లారీలు, టిప్పర్లు ప్రయాణం సాగిస్తున్నాయి. ట్రాఫిక్ ఉన్న సమయంలో కూడా జిల్లా కేంద్రం ఖమ్మంతో పాటు ఇతర మండల (మిగతా 6వ పేజీలో)



చరిత్ర, ప్రజల మనోగతాన్ని

గుర్తించండి

- ఆ ఐదు పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయండి
- ఏపీ జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో వాటిని మినహాయించండి
- కేంద్రహోం శాఖ మంత్రి, తెలుగు రాష్ట్రాల సీఎంలకు మంత్రి తుమ్మల లేఖ

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు అక్కడి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న క్రమంలో తెలంగాణ, ఏపీ సరిహద్దుల్లోని భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న ఆ ఐదు పంచాయతీల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏపీలోని జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల (17 రెవెన్యూ గ్రామాలతో కూడినవి)లను మినహాయించి వాటిని (మిగతా 6వ పేజీలో)

'ఏఐ'తో వీడియో పాఠాలు



- సాంకేతిక పరిజ్ఞానంతో పాఠ్యాంశాల బోధన
- కృత్రిమమేధ వీడియో పాఠాల తయారీలో ఉపాధ్యాయులు
- చిన్నారులను ఆకట్టుకుంటున్న పాఠాలు
- 'ఎవ్రీ చైల్డ్ రీడ్' కార్యక్రమానికి ఊతం 6

అటవీశాఖలో..

ఆగని అక్రమ రవాణా

- పర్మిట్ లేకుండా టేకు కలప తరలింపు
- ముచ్చర్ల వద్ద స్వాధీనం చేసుకున్న కారేపల్లి అటవీ సిబ్బంది
- ఖమ్మం డివిజన్ అధికారుల తీరుపై విమర్శలు
- విచారణ చేపట్టిన డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే సంద్ర కలప అక్రమ రవాణా విషయంలో జిల్లా అటవీశాఖ జాతీయ స్థాయిలో అప్రతిష్టను మూటగట్టుకొంది. ఆ ఘటనలో బీట్ ఆఫీసర్ నుంచి సెక్షన్ ఆఫీసర్.. ఆపైస్థాయిలోని ఎఫ్ఆర్వోపై కూడా సస్పెన్షన్ వేటు పడింది. ఉమ్మడి జిల్లాతో పాటుగా మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలో ఇంకా విచారణ కొనసాగుతోంది. అయినా ఖమ్మం డివిజన్‌లోని అటవీశాఖ అధికారుల తీరు మారటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సామిల్లులకు సలామ్ రాజ్



ఖమ్మం నగరంలోని ఇల్లెందు రోడ్డు ఖానాపురం వద్ద గల ఓ సామిల్ నుంచి పర్మిట్ లేని టేకు కలపను ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా జరగటంపై గత కొంతకాలంగా విమర్శలు వెలువడుతున్నాయి. సామిల్‌లో అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని జిల్లా అటవీశాఖ కార్యాలయానికి అనుసంధానం కూడా చేశారు. కాగా ఖానాపురం సెంటర్‌లోని సామిల్ నుంచి పర్మిట్ లేని టేకు కలపను ఏన్కూరు ప్రాంతానికి బుధవారం అక్రమంగా రవాణా జరుగుతుండగా అనూహ్యంగా ఇల్లెందు డీఆర్వో తనిఖీలు చేపట్టి కామేపల్లి మండలంలో ముచ్చర్ల వద్ద స్వాధీనం చేసుకుని కారేపల్లి అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. వెంటనే అక్రమ కలప విషయాన్ని పైస్థాయిలోని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి కలపను సీజ్ చేసి కలప ఎక్కడ నుంచి వచ్చిందో ఆ కలప సామిల్‌పై కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ ఖమ్మం అటవీశాఖలోని డివిజన్ స్థాయిలో అధికారి సామిల్లులకు సలామ్ కొట్టారు.

ఖమ్మంతో పాటు రఘునాథపాలెం అతడి పరిధిలోకి రావడంతో ఆ పక్కనే ఉన్న ముచ్చర్ల సిబ్బందితో మాట్లాడారని తెలుస్తోంది సామిల్లుపై కేసులు కాకుండా అక్రమ కలప తీవ్రతను తగ్గించే ప్రయత్నాలు చేశారని అటవీశాఖలో చర్చ జరుగుతోంది. కాగా ఇటీవల కాలంలో తాళ్లగూడెం సెక్షన్ మద్దులపల్లి బీట్ అటవీశాఖ సిబ్బందిపై ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల అక్రమంగా తరలిస్తున్న వేప కలప విషయంలోనూ కేసు కాకుండా ప్రయత్నాలు జరిగాయి. జిల్లా అటవీశాఖ అధికారి జోక్యంతో కేసు నమోదైంది. ఇలా వరుస సంఘటనలు జిల్లా వ్యాప్తంగా అటవీశాఖలో చర్చకు దారి తీశాయి. దీంతో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ బుధవారం రాత్రి అక్రమ కలప తరలింపుపై విచారణ చేపట్టారు.

కొనుగోలు కేంద్రాలను

పరిశీలించిన డీఎస్‌వో

కల్లూరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సివిల్‌సప్లయిస్ జిల్లా అధికారి చందన్‌కుమార్ సందర్శించారు. చేశారు. పలు రైస్ మిల్లుల్లోని ధాన్యం నిల్వలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో చందన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్ఏక్యూ నిబంధనలను పాటిస్తూ, ధాన్యం కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లులకు మాత్రమే పంపించాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని అలసత్వం వహించకుండా త్వరీతగతిన అన్‌లోడు చేసుకొని ఆ ధాన్యాన్ని ఓపీఎంఎస్‌లో నమోదు చేయాలని మిల్లుల యాజమానులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 326ధాన్యం కేంద్రాలకు గాను 321కేంద్రాలు ప్రారంభించగా అందులో 5కేంద్రాల నుంచి సుమారు 203 మెట్రిక్ టన్నుల గ్రేడ్ ఏ ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఆయన వివరించారు.



కల్లూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్వో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, చిత్రంలో పోతినేని తదితరులు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెడితే పోరాటాలు
- విదేశీ పత్తిని ప్రోత్సహిస్తున్న కేంద్రప్రభుత్వం
- కొత్తగూడెంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

కొత్తగూడెం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తేమశాతం పేరుతో కోతలు విధిస్తూ వ్యవసాయ అధికారులు రైతులను ఇబ్బందులు పెడితే పోరాటాలు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో సీపీఎం నేత గుగులోత్ ధర్మా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం కొత్తగూడెం వచ్చిన జాన్ వెస్లీ తొలుత కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల (మిగతా 6వ పేజీలో)

ఎర్రజెండాను అడ్డుకోవాలని చూస్తే సహించం

గుగులోత్ ధర్మా వర్ధంతి సభలో కమ్యూనిస్టు నేతలు 6

రేపు జాబ్ మేళా

జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు భారత్ హ్యుండాయ్ ప్రై. లిమిటెడ్, ఖమ్మంలో సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్)22, సర్వీస్ అడ్వయిజర్ 2 ఉద్యోగాలు కల్పించేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటీఐ, టేకులపల్లి) ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెంలో పనిచేసే విధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టుకు ఏదేని డిగ్రీ, టూవీలర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు 22 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన యువకులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 7036902902లో సంప్రదించాలని కోరారు.

సర్కారు బడులకు జీవం!

- ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతను పెంపొందించేలా కార్యాచరణ
- ఎస్ఎస్ఏ ద్వారా విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధి, రక్షణే ధ్యేయం
- పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక సమావేశాలు
- పాఠశాలల్లో ఈ నెల 25 వరకు అమలు



బోనకల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడులు జీవం పోసుకోనున్నాయి. ప్రభుత్వం చేపట్టిన క్లీన్ ఎండ్ సేఫ్ 5.0 కార్యక్రమంతో కొంతలో కొంతైనా స్కూళ్ల రూపురేఖలు మారనున్నాయి. దశాబ్ద కాలంగా ప్రభుత్వ బడులను పట్టించుకున్న నాథుడే లేడు. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం.. రంగులు వెలిసిపోయి, వర్షాలు వస్తే నీళ్ల లోపలికి రావడం.. మరుగుదొడ్లు లేక స్టూడెంట్స్ తీవ్ర ఇబ్బందులు పడేవారు. పాత గోదాంల మాదిరిగా బడులు ఉండడంతో.. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు క్రమేణా ఆసక్తి చూపించక పోవడం వల్ల ఎక్కువ మంది ప్రైవేటు బాట పట్టారు. దీంతో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. లెక్కకు మించి ఉపాధ్యాయులు ఉన్నా, పిల్లలు లేక బడులు కళ తప్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలు విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పాఠశాలల్లో మైనర్ మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక నిధులను కేటాయించారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను సకాలంలో పంపిణీ చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులకు ముఖ హాజరు అమల్లోకి తీసుకొచ్చి జవాబుదారీతనాన్ని పెంచారు. పర్యవేక్షణ కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడంతో.. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోంది. తాజాగా ప్రభుత్వం బడుల్లో పరిశుభ్రత, విద్యార్థుల రక్షణకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించే విధంగా క్లీన్ ఎండ్ సేఫ్ 5.0 కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్ర మాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే గత నాలుగు రోజులుగా పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు చే సే పనులు, తొలగించే కట్టడాలు, పాత సామగ్రి.. ఇతరాత్ర వివరాలకు ప్రత్యేక ఫార్మట్‌ను రూపొందించి ఆన్‌లైన్‌లో డేటా సేకరించారు.

విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధి, రక్షణ అంశాలే ధ్యేయం

కూలిపోయే స్థితిలో ఉన్న భవనాలను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలి. మైనర్, మేజర్ మరమ్మతు పనుల అవసరం ఉంటే వెంటనే చేయించాలి. సున్నం, రంగులను వేయించాలి. వంటగదిని శుభ్రంగా ఉండేలా అన్ని రకాల పనులు చేపట్టాలి. గ్యాస్ స్టవ్ ద్వారా వంట తయారీ, పాత్రలు శుభ్రం చేసుకునేందుకు నీటి వసతి కల్పన, వాటర్ ట్యాంకును పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పాఠశాలల్లో పేరుకు పోయిన పాత సామగ్రిని తొలగించాలి. విద్యార్థులు భోజనం చేశాక నీటి కుళాయిల వద్ద ఎలాంటి అపరిశుభ్రతకు తావు లేకుండా చూడాలి.

పారిశుధ్య పనుల నిర్వహణపై సమావేశాలు

పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో పాటు ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్ఎంలు, పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో 5.0 క్లీన్ ఎండ్ సేఫ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగ అధికారులు కూడా పాఠశాలలను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన పనులను గుర్తించి వివరాలను ఉన్నతాధికారులకు పంపుతున్నారు.

ఏఐతో వీడియో పాఠాలు



- సాంకేతిక పరిజ్ఞానంతో పాఠ్యాంశాల బోధన
- కృత్రిమమేధ వీడియో పాఠాల తయారీలో ఉపాధ్యాయులు
- విద్యార్థులను ఆకట్టుకుంటున్న పాఠాలు
- ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమానికి ఊతం

సత్తుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పిల్లల్లో పఠనా నైపుణ్యాన్ని పెంచడం కోసం ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కూడా దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్నారు. కలెక్టర్ సంకల్పానికి అనుగుణంగా ఖమ్మం జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు బోధనకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వీడియో పాఠాలు తయారు చేసి తరగతి గదిలో బోధిస్తున్నారు. ఒకప్పుడు తరగతి గదిలో పాఠాలు బోధించాలంటే.. ఉపాధ్యాయులకు నల్ల బల్ల బోధనోపకరణాలు పాఠ్యాంశ బోధనకు ఉపయోగపడేవి. మారుతున్న కాలంతో పాటు బోధనోపకరణాల వినియోగంలోనూ మార్పులొచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులను ఆకట్టుకునేలా బోధనోపకరణాలను కొందరు ఉపాధ్యాయులు తయారు చేసుకుంటున్నారు. సెల్‌ఫోన్‌లో వీడియోలు తయారు చేసి, మరికొందరు కృత్రిమమేధ (ఏఐ) వినియోగించుకొని పాఠాలు బోధిస్తున్నారు. వీడియోల్లో సన్నివేశానికి తగినట్టుగా పాటలను కూడా జోడించటం విశేషం. ఈ తరహా పాఠాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

వీడియో పాఠాలు బోధిస్తున్న నాగమణి

సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న నాగమణి తన సెల్‌ఫోన్‌తో పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియోలు తయారు చేస్తున్నారు. పాఠాలతో పాటు పండుగలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు, తదితర అంశాలను కూడా స్వయంగా వీడియోలుగా తయారు చేసి బోధిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్ల మాధ్యమం అమలవుతున్నందు వల్ల సంభాషణలు విద్యార్థులతో అభినయింపజేస్తూ వీడియోలు తయారు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉన్న ట్యాబ్‌లతో చూపుతున్నారు. తాను తయారు చేసిన ఆంగ్ల పాఠాల వీడియోలలో నాలుగవ తరగతికి వాటీజ్ ట్రీ, రెండవ తరగతికి వేరార్యూ స్వీటీ, లిటిల్ రెడ్ హెన్, హియర్ ఈజ్ యువర్ కాయిన్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు పర్వదినాలు, బస్ మేనర్స్ ప్రజల బాధ్యతలను తెలిపే వీడియోలు కూడా తయారు చేసి తరగతి గదుల్లో బోధిస్తుండడంతో.. విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. ఇతర ఉపాధ్యాయులు కూడా వినియోగించుకునేలా వీడియోలు వాట్సాప్ గ్రూపులలో ఉంచి మన్ననలను పొందుతున్నారు.



ఏఐ వీడియో చూస్తున్న విద్యార్థులు

ఏఐతో పాఠాల తయారీలో బండి నాగేశ్వర్

కృత్రిమమేధ (ఏఐ) ప్రస్తుతం సంచలనాత్మక సాంకేతిక పరిజ్ఞానంగా మారింది. సెల్‌ఫోన్లలో సైతం అద్భుతాలు సృష్టిస్తోంది. మాతృ భాషతో పాటు, ఆంగ్ల భాషలో పాఠాలు ఏఐని ఉపయోగించి ఉపాధ్యాయుడు బండి నాగేశ్వర్ బోధిస్తున్నారు. గతంలో సత్తుపల్లిలో పని చేసిన బండి నాగేశ్వర్ ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలం కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ 3, 4, 5 తరగతులకు 15 వీడియోలు తయారు చేశారు. నాలుగవ తరగతి విద్యార్థుల కోసం ఎలుక విందు, పరమానందయ్య శిష్యులు, ఆంగ్లంలో పాన్ కేక్, మిల్లర్ హిజ్ సన్, 3, 5తరగతులకు ఆంగ్ల పాఠాలు ద లిటిల్ రెడ్ హెన్, ద విట్టి నసీరుద్దీన్ తదితర ఏఐ వీడియోలు తయారు చేసారు. ఈ వీడియోలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి.

ఒక వీడియోకు ఆరేడు గంటల సమయం



బండి నాగేశ్వర్, ఉపాధ్యాయుడు

ఏఐతో ఒక వీడియో తయారు చేయడానికి ఆరేడు గంటల సమయం పడుతోంది. వీడియో పాఠాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. నాకున్న పరిజ్ఞానాన్నిఇతర ఉపాధ్యాయులకు కూడా అందజేస్తున్నా.

సహోపాధ్యాయుల సహకారంతో..

నాగమణి, ఉపాధ్యాయురాలు



పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారా ఏసురత్నం, సహోపాధ్యాయుల సహకారంతో నేను పాఠ్యాంశాల వీడియోలు తయారు చేసి బోధిస్తున్నాను. వీడియో పాఠాల బోధన ద్వారా విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి, పాఠాలు, ఇతర అంశాలు నేర్చుకోవాలనే ఉత్సాహం పెరుగుతోంది.

ఎర్రజెండాను అడ్డుకోవాలని చూస్తే సహించం

- ధర్మా వర్ధంతి సభలో కమ్యూనిస్టు నేతలు
- గిరిజన జాతిని చైతన్యం చేసిన గుగులోత్ ధర్మా సేవలు శ్లాఘనీయమని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని)

సుజాతనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎర్రజెండాను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని పలువురు కమ్యూనిస్టు నేతలు హెచ్చరించారు. ఎర్రజెండా ముద్దుబిడ్డ గుగులోత్ ధర్మా రెండవ వర్ధంతి సందర్భంగా మండలంలోని మంగపేట గ్రామం వద్ద ధర్మా విగ్రహాన్ని, స్థూపాన్ని కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాలు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం జిల్లా నాయకులు కు న్నేత్ ధర్మా అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ఎర్రజెండా ముద్దుబిడ్డ గుగులోత్ ధర్మా అని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. గిరిజన జాతిని చైతన్యం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడ్డ ఎర్రజెండా ముద్దుబిడ్డ అని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరుగా, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన యోధుడే ధర్మా అని అన్నారు. మానవ జాతి ఎదుర్కొంటున్న సమస్త సమస్యలకు పరిష్కారం చూపించగల శక్తి ఒక్క ఎర్రజెండాకు మాత్రమే ఉందన్నారు. ఎవరైనా ఎర్రజెండాను అడ్డుకోవాలని చూస్తే సహించబోమన్నారు. దేశం చుట్టూ ఉన్న ఇతర దేశాల్లో సోషలిజం కమ్యూనిస్టుల పాలన వస్తుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, సీపీఎం సీనియర్ నాయకులు పి సోమయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఎజే రమేష్, శ్రీరామ్ నాయక్, ఎం జ్యోతి, గుగులోత్ ధర్మా సతీమణి కౌసల్య, కుమారుడు రవికిరణ్, కూతురు విజాయాభాయి, అల్లుడు జీవన్ బాబు, ధర్మా సోదరుడు భీమారావు, బాబురావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యు లు భూక్యా వీరభద్రం, రైతు సంఘం సాయి, కార్యదర్శి మూ డు శోభన్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ధర్మానాయక్, కన్వీనర్ వాంకుడోత్ అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

8 కిలోమీటర్లు కాలినడకన గుట్టపైకి..

వీరభద్రుడి ఆలయానికి కలెక్టర్

చంద్రుగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండాలపాడు శివారులోని కనకగిరి గుట్టలపైన ఉన్న వీరభద్రుడి స్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, డిప్యూటీ కలెక్టర్ మురళితో కలిసి పూజలు నిర్వహించారు. బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా వీరు కనకగిరి గుట్టలపైకి ఎనిమిది కిలోమీటర్లు నడిసి వీరభద్రుడి ఆలయానికి చేరుకొని వీరభద్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుట్టలపై కాకతీయులు నిర్మించిన ఆనాటి రాతి కట్టడాలను పరిశీలించారు. ఈ పూరాతన నిర్మాణాలను రాబోయే తరాలకు గత చరిత్ర ఆనవాళ్లుగా నిలుస్తాయని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని స్థానికులకు సూచించారు. ఈ సందర్భంగా దిశా కమిటీ సభ్యులు బొర్రా సురేష్ గుట్టలపై ఉన్న పలు ఆలయాల వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాగా అధికారులు గుట్టపైకి వెళ్లేందుకు స్థానికులు బొర్రా సురేష్‌తో పాటు రవీందర్ రెడ్డి, నాగరాజు, వెంకటేష్, నాగేంద్రబాబు సహకరించారు.



కనకగిరి గుట్టను పరిశీలిస్తున్న కలెక్టర్

సామినేని రామారావు కుటుంబానికి మాజీ ఎంపీ నామ ఫోన్‌లో పరామర్శ

చింతకాని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దారుణ హత్యకు గురైన చింత కాని మండలం పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్షనే త, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఫోన్ ద్వారా పరామర్శించారు. కుమా రుడు సామినేని విజయ్‌తో మాట్లాడి జరిగిన ఘటన తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని, కుటుంబ సభ్యులు అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. రామా రావు లాంటి సీనియర్ రాజకీయ నాయకుడిని కోల్పోవడం అటు పార్టీకి, ప్రజా ఉద్యమానికి పెద్ద నష్టం అని అన్నారు. తనతో ఫోన్‌లో మాట్లాడిన రామారావు కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కల్పించారు. రామారావు హత్యను తీవ్రంగా ఖండి స్తూ, దోషులను త్వరితగతిన పట్టుకుని కఠినంగా శిక్షించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ప్రజా నాయకులపై ఇలాంటి దాడులు ప్రజాస్వా మ్యానికి మచ్చ అన్నారు. రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని నామ ఆకాక్షించా రు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రామారావుకు నివాళులర్పించిన బీఆర్ఎస్ మండల కమిటీ

బుధవారం పాతర్లపాడు గ్రామంలో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన సామినేని రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పొద్దుటూరు గ్రామ మాజీ సర్పంచ్ పెంట్యాల పుల్లయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, గద్దం శ్రీను, పాపినేని రంగారావు, సామినేని అప్పారావు పాల్గొన్నారు.

‘చుక్కల’కు చిక్కులు!

(5వ పేజీ తరువాయి)

నుంచి పార్క్ నిర్మించిన తర్వాత ఏటా పదుల సంఖ్యలో చుక్కల దుప్పులు మృత్యువాతకు గురవుతున్నాయి.

సింగరేణి నిధులతో చైన్‌లింక్ ఫెన్సింగ్ ఏర్పాటు

రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, సీసీఎఫ్ బీమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్‌లు దుప్పుల రక్షణ కోసం సింగరేణి ఆధ్వర్యంలో చైన్‌లింక్ ఫెన్సింగ్‌ను సెప్టెంబర్ నెలలో ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన నిధులను మంత్రి చొరవతో ఒక్కరోజులోనే విడుదల చేయగా.. అధికారులు పార్క్‌కి ఉత్తరాన పనులను వేగంగా పూర్తి చేశారు. అయితే వీటి ఎత్తు 6అడుగుల మాత్రమే ఉండగా.. కనీసం 10అడుగుల మేర ఉన్నట్లయితే దుప్పులు బయటకు రాకుండా ఉంటాయి. వీధికుక్కలు తరిమినప్పుడు, అవి ఆడుకుంటూ సుమారు ఆరేడు అడుగులకు పైగానే ఎగిరి గంతేసే అవకాశం ఉంది. దీని వల్ల దుప్పులు రోడ్డు పైకి వస్తుండడంతో.. ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫెన్సింగ్ ఎత్తును పెంచాలని పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన ప్రహరీ

పార్క్‌కు దక్షిణం, తూర్పు వైపు మెయిన్ గేట్ వరకు గతంలో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయగా.. ఇటీవల వెనుక ఉన్న సింగరేణి ఓసీ వైపు ఎస్‌సీసీఎల్ సంస్థ ఫెన్సింగ్‌ను నిర్మించింది. కానీ పట్టణానికి దగ్గరలో ఉన్న ప్రహరీ ఏళ్ల నాటిది కావడంతో శిథిలావస్థకు చేరింది.



సత్తుపల్లిలోని నీలాద్రి అర్బన్ పార్క్

అదేవిధంగా సమీప ప్రాంత ప్రజలు చెత్తాచెదారం వేయడంతో.. దుప్పులు ఆహారం కోసం, కుక్కలు తరిమినప్పుడు అటువైపుగా ప్రహరీ గోడను ఎక్కి జనావాసాల్లోకి రావడం, ఆ తర్వాత ప్రమాదాలు గురై గాయాల పాలై మృతి చెందడం జరుగుతోంది. అలాగే సింగరేణి వైపు నుంచి జనవాసాల్లోకి వస్తున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. ఈ ప్రహరీకి ఆనుకొని 10 అడుగుల మేర నూతనంగా నిర్మించడం గానీ, పాత గోడపై 10అడుగుల మేర ఫెనింగ్, సోలార్ ఫెన్సింగ్ గానీ ఏర్పాటు చేసినట్లయితే పార్క్ నుంచి దుప్పులు బయటకు వచ్చే అవకాశం ఉండదు. ఈ విషయమై సత్తుపల్లి అటవీశాఖ రేంజర్ పీ.స్నేహలతను వివరణ కోరగా.. దుప్పులు అనారోగ్యానికి గురైనప్పుడు, వీధి కుక్కలు తరిమినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా సింగరేణిలో బాంబ్ బ్లాస్టింగుల కారణంగా భయపడి పరుగులు పెడుతూ జనావాసాల్లోకి వస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

(5వ పేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తిని దిగుమతి చేసుకోవడం వల్ల మన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన చెందారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం ప్రకటించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఫీజులు చెల్లించకపోవడం వల్ల నిర్వహిస్తున్న సమ్మెకారణంగా విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ప్రభుత్వం వె ంటనే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి పెరిగిపోయిందని, దీనివల్ల యువత జీవితాలు అఘాథంలోకి నెట్టబడుతున్నాయని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా నిర్మించేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల కోసం ఆంధ్రప్రభుత్వం కుట్ర పన్నుతోందని, తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వాటాలు తేలే వరకు బనకచర్ల ప్రాజెక్టుకి ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని జాన్‌వెస్లీ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, భద్రాద్రి జిల్లా కార్యాదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైస్పీడ్‌కు అడ్డేదీ?

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలు, మునిసిపల్ పట్టణాల్లో అధికలోడుతోనే రవాణాజరుగుతోంది.

అతివేగాన్ని నియంత్రించాల్సిందే..

ఇటీవల రంగారెడ్డి జిల్లాలో ఓ కంకర టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో 19మంది మృత్యువాత పడిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో తప్పుడు పర్మిట్లతో ఖనిజ సంపదను తరలించే క్రమంలో రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలు నడుస్తున్నాయి. పగటివేళ ఇసుక, మట్టి , కంకర లాంటివి రవాణా జరుగుతుండగా.. అర్ధరాత్రుళ్లు కూడా టిప్పర్లు అతివేగంతో రవాణా సాగిస్తున్నాయి. ఇటీవల ఖమ్మం బస్టాండ్ ఎదురుగానే అతివేగంగా వచ్చిన ఓ లారీ బస్సును వెనుకనుంచి ఢీ కొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇలాంటి సంఘటనలు నిత్యం ఉమ్మడిజిల్లాలో జరుగుతున్నాయి. సింగరేణి బొగ్గులారీలు కూడా అతివేగంగా ప్రయాణిస్తున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత అప్రమత్తం అయ్యేకంటే జరగకముందే వేగ నియంత్రణ, రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించి.. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తే లారీలు, టిప్పర్ల అతివేగానికి బ్రేక్ పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చరిత్ర, ప్రజల మనోగతాన్ని గుర్తించండి

(5వ పేజీ తరువాయి)

తెలంగాణలోని భద్రాచలంలో విలీనం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, ఎనుముల రేవంత్ రెడ్డిని అభ్యర్థించారు. ఐదు పంచాయతీల అంశంలో చారిత్రక ప్రాధాన్యత కొనసాగింపు, స్థానిక ప్రజల మనోభావాలను గుర్తించి భద్రాచలంలో ఆ ఐదు పంచాయతీలను విలీనం చేయాలని కోరుతూ వారికి లేఖలు రాశారు. దశాబ్ది కాలంగా ఈ గ్రామాలను తెలంగాణలో పునరుద్ధరించాలని తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతవాసులు ముఖ్యంగా గిరిజన వర్గాల నుంచి నిరంతర ప్రాతినిధ్యం ఉందని గుర్తు చేశారు. ఇప్పటికే స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు వినతిపత్రాలు, శాంతియుత నిరసనలు, ప్రజా వేదికల ద్వారా వ్యక్తమైన విషయాన్ని ఆయన పేర్కొన్నారు. భద్రాద్రి రామాలయం తెలంగాణలో ఉంటే రామయ్య భూములు ఆంధ్రాలోని పురుషోత్తపట్నంలో ఉన్నాయని, దీంతో పాలనాపరంగా సమస్యలు తలెత్తిన సందర్భాలున్నాయన్నారు. అలాగే రాముడు నడయాడిన ఈ ప్రాంతంతో ముడిపడి ఉన్న గుండాలలోని ఉష్ణగుండాల, జటాయువు మండపం కొలువుదీరిన యటపాక, 900 ఎకరాల భద్రాద్రి రామయ్య భూములు పురుషోత్తపట్నంలో ఉన్నాయన్నారు. అలాగే భద్రాచలం నుంచి చర్ల వెళ్లే మార్గంలో 8 కిలోమీటర్లు ఏపీ పరిధిలో ఉండటంతో ఆ ప్రాంతవాసులు కూడా భద్రాద్రితోనే తమ అనుబంధం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే కాకుండా భద్రాచలంలో అవసరాల రీత్యా కావాలంటే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వ స్థలం లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. సహకార సమాఖ్యవాదం, ప్రజల కేంద్రీకృత పాలన స్ఫూర్తితో ఈ దీర్ఘకాల అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఐదు పంచాయతీలను విలీనం చేసేందుకు ఇదే సరైన సమయమని, కేంద్ర, ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి స్థానికుల మనోభావాలను గుర్తించాలని తుమ్మల తన లేఖల్లో కోరారు.

ఆకట్టుకున్న కళా ఉత్సవ్



విజేతలతో విద్యాశాఖ అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సైన్స్ మ్యూజియంలో సోమవారం జరిగిన కళా ఉత్సవం ఆకట్టుకుంది. మొత్తం 21 పాఠశాలల నుంచి అనేకమంది విద్యార్థులు పాల్గొని అలరించారు. జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా కేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా అకాడమిక్ మానీటరింగ్ అధికారి పెసర ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విజేతలకు అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీజ అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. ఓకల్ మ్యూజిక్ సోలో న్యూవిజన్ ఉన్నత పాఠశాలకు చెందిన అమృత, గ్రూప్ డాన్స్‌లో పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన దీక్షిత బృందం, టుడీ విజువల్ ఆర్ట్‌లో తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నేహా, గ్రూప్ విజువల్ ఆర్ట్స్‌లో శ్రీలేఖ, ప్రసన్న, నిహారిబృందం, థియేటర్ ఆర్ట్స్‌గ్రూపులో సర్వజ్ఞ ఉన్నతపాఠశాలకు చెందిన శ్రీకర్ బృందం, ఓకల్ మ్యూజిక్ గ్రూపులో పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీలక్ష్మీ ప్రసన్న బృందం సోలో క్లాసికల్ డాన్స్‌లో న్యూవిజన్ ఉన్నత పాఠశాలకు చెందిన సాన్వి, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో న్యూవిజన్ ఉన్నత పాఠశాలకు చెందిన అన్వేష్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్‌లో పందిళ్ళపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన గోపి అండ్ గ్రూప్ త్రీడీ విజువల్ ఆర్ట్స్‌లో న్యూ విజన్ ఉన్నత పాఠశాలకు చెందిన భావన సాంప్రదాయ స్టోరీ టెల్లింగ్ పోటీలో జెడ్‌పీహెచ్‌ఎస్ మోమీనాన్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయిశ్రీలు విజేతలుగా నిలిచారని తెలిపారు. ఎంపికైన విజేతలు రాష్ట్రస్థాయిలో జరుగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అండర్ 17 కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

కొణిజర్ల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోని ఏడూళ్లబయ్యారంలో జరగనున్న అండర్17 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో ఆడేందుకు కొణిజరల మండలం తనికెళ్ల సమీపంలోని మహాత్మజ్యోతిరావుపూలే పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంజిత్‌కుమార్ బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన వేణు, జగన్‌నాయక్ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఖమ్మం ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి సీహెచ్ రాంబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంజిత్‌కుమార్, ఏటీపీ రెడ్డి, భాస్కర్, పీటీ టి.భాస్కర్ అభినందించారు.



రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైన విద్యార్థులు





దీపం.. కార్తీక శోభితం..

ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు
కాంతులీనిన ఆలయాలు
శివయ్య దర్శనానికి బారులుతీరిన భక్తులు
సాయంత్రం ఘనంగా జ్వాలాతోరణం

ఖమ్మం ఖానాపురంహవేలి / కొత్తగూడెం సాంస్కృతికం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. కూసుమంచి గణపేశ్వరాల యం, తీర్థాల సంఘమేశ్వరస్వామి ఆలయం, గుంటుమ ల్లేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణబజారు శివా లయం తదితర ఆలయాలు బుధవారం దీపాల వెలుగులో కార్తీక శోభను సంతరించుకున్నాయి. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్తీక దీపాల వెలుగులో ఆలయ సముదాయం పౌర్ణమి శోభను సంతరించుకున్నది. ఖమ్మం నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజామున దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు గతానికి భిన్నంగా ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయటంతో ప్రశాంతంగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు దాములూరి వీరభద్రశర్మ, కృష్ణశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయంలో ఊంజల్ సేవ, జ్వాలా తోరణం ఘనంగా నిర్వహించారు. అలాగే నగరంలోని ఎస్పీ ఆఫీస్ రోడ్డులోని శివాలయం, కాల్వొడ్డులోని సత్యనారాయణ సహిత వీరాంజ నేయ స్వామి ఆలయం, ఇందిరానగర్ పర్ణశాల రామాలయం, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మ వారి ఆలయం, బాలాజీనగర్ రామాలయం, అభయ వెంకటేశ్వరస్వామి ఆల యం, కాశీవిశ్వేశరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వమించారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి సాయంత్రం ధ్వజారోహణం, జ్వాలాతోరణం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు చైతన్యనగర్, శ్రీనివాసనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప దీక్షాదారులు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. దీపారాధన వెలు గులతో జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లందు, పినపా క, భద్రాచలం, అశ్వారావుపేట నియోజక వర్గా ల్లోని ఆలయాలు కాంతులీనాయి. భక్తులు తెల్ల వారుజామున తలంటు పుణ్యస్నానాలు ఆచరిం చి ఆలయాలకు చేరుకుని దేవతామూర్తులను దర్శించుకున్నారు. . ప్రధానంగా శివాలయాల్లో భక్తులు కిక్కిరిసిపోయారు. కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో జ్వాలతోరణం ఘనంగా జరిగింది. పాండురంగా భజనమందిరంలో భక్తులు సా మూహిక సత్యనారయణస్వామి వ్రతాలు ఆచ రించారు. కొత్తగూడెం ప్రగతినగర్ ఉమామ హేశ్వారాలయం, రుద్రంపూర్ శివాలయం, రై టర్‌బస్తీ శ్రీమాత పంచాయతన క్షేత్రంతోపాటు ఇతర ఆలయాలు వెలుగు విరజిమ్మాయి. ప్రగతీ నగర్ శివాలయంలో పూజల్లో కొత్తగూడెం స్పెష ల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెం డు రాజమల్లు పాల్గొన్నారు. ఆయన వెంట త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.


జూలూరుపాడు మండలం కాకర్ల వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రభ బండ్లతో ప్రదక్షిణ నిర్వహిస్తున్న గ్రామస్థులు




ఖమ్మం శివాలయం గోపురం మీదుగా కనిపించిన నిండు చంద్రుడు


ఖమ్మం ఎస్పీ ఆఫీస్ రోడ్ శివాలయం వద్ద సందడి


భద్రాద్రి గోదావరి వద్ద దీపాలను వెలిగిస్తున్న మహిళలు


అన్నపురెడ్డిపల్లిలో భద్రాద్రి ఎస్పీ ప్రత్యేక పూజలు


చంద్రుగొండ మండలం కనకగిరి గుట్టలపై వీరభద్రస్వామిని దర్శించుకున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

భద్రగిరికి కార్తీక శోభ

పవిత్ర గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు
కార్తీక దీపాలను వెలిగించిన భక్తులు
సత్యనారాయణవ్రతంలో పాల్గొన్న 52 మంది జంటలు


భద్రాచలం వద్ద గోదావరి తీరంలో భక్తుల సందడి

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామయ్య దివ్యక్షేత్రం.. భద్రాచలం కార్తీక పౌర్ణమి శోభను సంత రించుకుంది. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తు లు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలను ఆచరించి.. సంకల్పం, సూర్య నమస్కారం, కార్తీక దామోదురుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరీ నదీ తీరంలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యే శ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలలో పూజా కార్య క్రమాలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే తమ ఆరాధ్య దైవమైన సీతారామచంద్రుడిని కనులారా వీక్షించారు. ఆలయంలో స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలను వెలిగించారు. అలాగే రామాలయ ప్రాంగణంలోని చిత్ర కూట మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించగా 52 మంది భక్తులు పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని రామాలయానికి అను బంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వే శ్వరస్వామి వారి ఆలయంలో పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే జ్వాలాతోర ణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోదావరి నదికి పూజలు, పంచహారతులను సమర్పించారు. ఈ పూజల్లో భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దంపతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


భద్రాచలం రామాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


షష్టి పూర్తి కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధ దంపతులు

తల్లంపాడులో సామూహిక షష్టి పూర్తి

పూజారి సహకారంతో 35 జంటలకు సత్కారం
రామాలయంలో కార్యక్రమం.. గ్రామంలో కోలాహలం


కాశవజ్జల పురుషోత్తంశాస్త్రి


దండలు మార్చుకుంటున్న దంపతులు

ఖమ్మం రూరల్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కార్తీక పౌర్ణమి సంద ర్భంగా ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలో 65ఏళ్లు నిండిన35 జంటలకు బుధవారం సామూహిక షష్టి పూర్తి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో జరిగిన ఈ కార్యక్రమం లో గ్రామ పురోహితుడు కాశవజ్జల పురు షోత్తంశాస్త్రి తన సొంత ఖర్చులతో ఆ జంటలకు నూతన వస్త్రాలు, శాలువాలు, పూలదండలు తీసుకువచ్చి షష్టిపూర్తి చే యించారు. వృద్ధ దంపతులతో ఒకరికొక రు దండలు మార్పించడంతో పాటు అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం చేయించారు. పూజానంతరం 35 జంటలను పూజారి కాశవజ్జల పురుషోత్తంశాస్త్రి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గ్రామంలో వృద్ధ దంపతులను గుర్తించి వారికి సొంత ఖ ర్చులతో షష్టి పూర్తి చేయించిన పూజారి పురుషోత్తంశాస్త్రిని గ్రామస్థులు అభినందించారు.

అత్యంత వైభవంగా గట్టు జాతర

గుబ్బలమంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


నందిగామ తోగు వద్ద శివపార్వతులకు పూజలు చేస్తున్న భక్తులు

కరకగూడెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమత్ భట్టుపల్లి పంచాయతీ కుర్నవల్లి గ్రామం నుం చి సుమారు 7 కిలోమీ టర్ల దూరంలో కొలువు తీరిన సమ్మక్క, సారల మ్మ గట్టు జాతర బుధ వారం అత్యంత వైభవం గా జరిగింది. ప్రతి ఏడాది కార్తీకపౌర్ణమి రోజున జరిగే ఈ గట్టు జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులు ప్రత్యేక మొక్కులు తీర్చుకుని దీపాలను వెలిగించారు.

గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తజనం

మండలంలోని భట్టుపల్లి పంచాయతీ పరిధిలోని రాళ్ళవాగు సమీ పంలో కొలువు తీరిన గుబ్బల మంగమ్మ ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ కొలువు తీరిన జలలింగేశ్వర శివ లింగం వద్ద భక్తులు అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆల యంలో, గుబ్బలమంగమ్మ ఆలయం, శివ లింగం వద్ద భక్తులు దీపా లను వెలిగించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి ఈశ్వరోజు ప్రణయ్‌చారి, ఆలయ ధర్మకర్త కోటగిరి సతీష్ ఆధ్వ ర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సత్తుపల్లి ఏరియాను ముందంజలో ఉంచేందుకు అందరి సహకారం అవసరం

కిష్టారం ఓసీపీ సందర్శనలో జీఎం చింతల శ్రీనివాస్


జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

సత్తుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సం స్థలో 12వ ఏరియాగా ఆవిర్భ వించిన సత్తుపల్లిని ముందం జలో ఉంచేందుకు అందరి సహకారం అవసరమని సత్తు పల్లి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. బుధవా రం ఆయన మండలంలోని కి ష్టారం ఓసీపీని సందర్శించి అక్కడి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారితో స మావేశమయ్యారు. ఓసీలకు నిర్ధేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించేం దుకు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, ఆ క్రమంలోనే పర్యా వరణ పరిరక్షణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఈ సందర్భంగా జీఎంను ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏజీఎం ఎంవీ.నరసింహారావు, అధికారులు జీ.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, నాయకులు సముద్రాల సుధాకర్, కిషోర్, క్రాంతికుమార్, బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఖమ్మం క్రీడాకారుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 1 నుంచి 3 వర కు వరంగల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 జిమ్నాస్టిక్స్ పోటీ ల్లో ఖమ్మంకు చెందిన ఇద్దరు బాలికలు సత్తాచాటి పతకా లు సాధించారు. నగరంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే క్రీడాకా రులు మనోజ్ఞ, దీక్షితలు కాంస్య పతకాలు సాధించారు. అంతేకాకుండా మరో క్రీడాకారుడు మోక్ష చంద్రశేఖర్ జాతీయ పోటీలకు ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, కోచ్ భవ్య అభినందించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

పోడు భూమిలో పత్తి పంట ధ్వంసం

అటవీ భూమి ఆక్రమించుకోవటంతోనే చర్య : ఎఫ్‌డీవో


ధ్వంసమైన పత్తి పంటను చూసి విలపిస్తున్న పోడు రైతులు

చంద్రుగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పోకలగూడెం బీట్ పరి ధిలో పోడు భూముల్లో రావి కంపాడుకు చెందిన గిరిజ నులు గుగులోత్ వాలి, తేజా వత్ సరోజ సాగుచేసిన నా లుగు ఎకరాల్లోని పత్తి పంట ను అటవీ అధికారులు మం గళవారం రాత్రి ధ్వంసం చేశా రు. పోడు రైతులు బుధవారం ధ్వంసమైన పత్తి చేనును చూసి విల పించారు. జీవనాధారమైన పంటను నాశనం చేయటం అధికారులకు తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎఫ్‌డీవో కోటేశ్వ రావు ఫోన్‌లో సంప్రదించగా అటవీశాఖ ఏర్పాటు చేసిన హద్దులు దాటి అడవిలోకి ప్రవేశించి భారీ వృక్షాలను నరికి పంటలు సాగుచేశారని, అటువంటి చర్యలను కఠినంగా అడ్డుకుంటామని తెలిపారు.

బాలికపై లైంగికదాడి కేసులో ముగ్గురి అరెస్టు

కొణిజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రార్థనామందిర నుంచి ఇంటికి వస్తున్న ఓ మైనర్‌ను 'మీ తమ్ముడు కింద పడిపోయాడు. వెంటనే రా' అం టూ మాయమాటలు చెప్పి ఓ ఇంట్లోకి తీసుకెళ్లి సామూహికంగా లైంగిక దాడి చేసిన ఘటనలో ముగ్గురు అరెస్టయ్యారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని ఓ గ్రామంలో గతనెల 31వతేదీ రాత్రి జరిగిన ఈ ఘటనలో నిందితులుగా ఉన్న 19 ఏళ్ల యువకుడు అరవింద్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లను అరెస్టుచేసి కోర్టుకు రిమాండ్‌చేసినట్టు కొణిజర్ల ఎస్‌ఐ సూరజ్ తెలిపారు. యువకుడిని జైలుకు తరలించగా ఇద్దరు మైనర్లనుజువైనల్ హోంకు తరలించామన్నారు.

51.9 కిలోల గంజాయి పట్టివేత

కేరళకు చెందిన ఇద్దరి అరెస్టు, పరారీలో ఒకరు

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో బుధవారం ఎక్సై జు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు రెండు కేసుల్లో మొత్తం 51.900 కేజీల గంజాయిని పట్టుకోవడంతో పాటు కేరళకు చెందిన ఇద్దరిని అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. ఈనెల 8వరకు నిర్వహించనున్న అక్రమ మద్యం, నాన్‌డ్యూటీ లిక్కర్, గంజాయి రవాణా నిఘా ఉంచేందుకు నిర్వహిస్తున్న స్పెసల్ డ్రైవ్ లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా టాటా పంచ్ వాహనంను తనిఖీ చేస్తుండగా 30.600 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న కేరళకు చెందిన నజీర్ పుతియపటేల్, జకారియా పారాయి ల్‌లను అరెస్టు చేయగా మరో వ్యక్తి కె.రవి పరారీలో ఉన్నారు. మరో సంఘ టనలో యమహా ఆర్15 బైక్‌పై బాక్సు వదిలి పారిపోతుండగా పరిశీలిం చగా 21.300 కేజీల గంజాయి లభ్యమైంది. మొత్తం 51.900 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్ శ్రీహరి తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది బాలు, సుదీర్, హరీష్, వెంకట్, హనుమంతరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

తిరుమలాయపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చికిత్సపొందుతు మహిళ మృతిచెందిన ఘటన బుధవారం మండలంలో జరిగింది. మండలంలోని తెట్టెలపాడుకు చెందినతోడేటి నాగమణి(49) వ్యవసాయం చేస్తూజీవిస్తున్నారు. గతనెల 28వతేదీన మిర్చితోటకు మందు కొట్టేందుకు వెళ్లారు. ఈక్రమంలో వ్యవసాయ మోటార్‌కు ఉన్న గేట్‌వాల్ తీస్తుండగా వాల్‌కు మూతవచ్చి కుడికంటికి తగిలి కన్నుపోయింది.దీంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యసేవలందించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాదు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెంది. మృతురాల బంధువులు స్థానికపోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సింగరేణిలో పలువురి అధికారుల బదిలీలు

కొత్తగూడెం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అడిషనల్ జీఎంలు, డీవైజీఎంలు, అడిషనల్ మేనే జర్లను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్ గనిలో అడిషనల్ జీఎం గా పనిచేస్తున్న నిక్కినినేని శ్రీ రమేష్‌ను మణుగూరు ఏరియాలోని పీకే ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారిగా బదిలీ చేశారు. సత్తుపల్లి ఏరియాలోని క్రిష్టారం ఓసీలో అడిషనల్ జీఎంగా పనిచేస్తున్న నరసింహారావును కొత్త గూడెం ఏరియాలోని వికెఒసి ప్రాజెక్ట్ అధికారిగా భూపాలపల్లిలో డీవైజీ ఎంగా పనిచేస్తున్న గంగ లలితేంద్ర ప్రసాద్‌ను మందమర్రి ఏరియాకు, రామగుండం -1లో డీవైజీఎంగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను రామగుండం-3 ఏరియాకు, ఆర్‌జీ-3లో డివైజీఎంగా పనిచేస్తున్న ప్రవీణ్‌ను రామగుండం -1కు బదిలీ చేశారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 17 మంది అధికారు లను యాజమాన్యం బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు నిర్ధేశించిన సమయంలో విధుల్లో చేరాలని ఆదేశించింది.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

టేకులపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు ఆడుతున్న ముగ్గురిని బోడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం ప్ర కారం మండలంలోని మొట్లగూడెం సమీప అటవీ ప్రాంతంలో బుధవారం కొంతమంది కోడిపందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు కోడిపందాల స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆళ్లపల్లికి చెందిన నిట్ట రమేష్, రాయపాడుకు చెందిన పెండకట్ల ఆనందరా వు, మొట్లగూడెం గ్రామానికి చెందిన కొలగాని కృష్ణలను అదుపులోకి తీసు కున్నారు. వారి నుంచి రూ.2500లు, రెండు వాహనాలు, కోళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

జంతువులపై విష ప్రయోగం?

10 శునకాలు, మూడు పిల్లులు, ఒక గుర్రం మృతి

భద్రాచలం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని రెవెన్యూ కాల నీలో గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన విషాహారం తిని జంతువులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 10 శునకాలు, మూడు పిల్లులు, ఒక గుర్రం మృతి చెందాయి. దీంతో సమాచారం అందుకున్న సొసైటీ ఫర్ ప్రివె న్షన్ ఆఫ్ క్రూయాల్టీ ఆన్ యానిమల్స్(ఎస్‌పీసీఏ) సభ్యులు ఘటనా స్థలా నికి చేరుకొని పరిశీలించారు. కాగా ఒక శునకాన్ని వైద్యచికిత్స కోసం తర లించగా కోలుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సమాచారం అందుకున్న పో లీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన శునకం, పిల్లిని పోస్టు మార్టం నిమిత్తం పశువైద్యశాలకు తరలించగా పశువైద్యులు వాటికి పోస్టు మార్టం నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులకు కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశారు..

పెట్రోల్ బాటిళ్లతో తండ్రి, కొడుకు నిరసన

అశ్వాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హెవీవాటర్ ప్లాంట్‌లో ఉద్యో గం ఇప్పిస్తామంటూ తమ వద్ద రూ.7లక్షల నగదు తీసుకుని ఓ ఇద్దరు వ్యక్తులు మోసగించారంటూ తండ్రీకొడుకులు పెట్రోల్ బాటిళ్లతో నిరసనకు దిగారు. ఈ సంఘటన బుధవారం అశ్వాపురం మండలంలోని అణుశక్తి న గర్‌లో జరిగింది. తన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌కు హెవీవాటర్ ప్లాం ట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సదరు ఇద్దరు వ్యక్తులు తన నుంచి రూ. 7లక్షలు తీసుకున్నారని ఆరోపిస్తూ ఇల్లెందు ప్రాంతానికి చెందిన మల్లేష్ తన కుమారుడితో కలిసి పెట్రోల్ బాటిళ్లతో తమను మోసగించిన ఇద్దరిలో ఓ వ్యక్తి ఇంటి ఎదుట నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. స్థానికలు ద్వారా విషయం తెలు సుకున్న పోలీసులు అణుశక్తినగర్‌కు చేరుకుని వారిని అడ్డుకున్నారు. తగిన న్యాయం చేసేలా చూస్తామని చెప్పి.. వారిని అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన అణుశక్తినగర్‌లో కలకలం రేపింది.

ఎస్‌జీఎఫ్ అండర్ -14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్‌లో..

తృతీయ విజేత ఖమ్మం బాలురు


తృతీయ స్థానంలో నిలిచిన ఖమ్మం జిల్లా బాలుర జట్టు

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌జీఎఫ్) అండర్ -14 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో ఖమ్మం జిల్లా జట్టు నిలిచాయి. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య కప్‌లను అందజేశారు.

అన్నదానానికి రూ.35వేల వితరణ

సత్తుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీ.శ.1000నుంచి క్రీ.శ.1360ల మధ్య కాకతీయుల కాలంలో ప్రతిష్ఠ కావించిన మండలంలోని కాకర్లపల్లిలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిత్యం పూజలందుకుంటుంది. కార్తీక మాసం సందర్భంగా ఈనెల 18న జరుగు అఖండ అన్నసమారాధన కార్యక్రమానికి గ్రామపెద్దలు కంచర్ల బాబూరావు, శ్రీదేవి దందంపతులు రూ.35,116లు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు వితరణగా అందజేశారు. దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పువ్వాళ్ల ఉమా, కంచర్ల రమేష్, చల్లారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ వాహనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

విద్యుత్ ఎమర్జెన్సీ వాహనం ప్రారంభం

ఖమ్మం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ ఎమర్జెన్సీ టీం (ఎమర్జెన్సీ రీస్టోరేషన్ టీమ్) వాహనం అందుబాటులోకి వచ్చినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో బుధవారం విద్యుత్ ఎమర్జెన్సీ వాహనాన్ని ఎస్ఈ శ్రీనివాసాచారి ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం కార్పోరేషన్లు, ఖమ్మం వంటి టౌన్లు వరకే ఉన్న సదుపాయాన్ని ఈ రోజు ఏదులాపురం మున్సిపాలిటీకి తీసుకురావడం జరిగిందన్నారు. అట్టి వాహనంలో మాన్‌పవర్, మెటీరియల్స్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఏవిధమైన విపత్తులు సంభవించి స్థంబాలు పడిపోయి, చెట్లు కూలిపోయిన లైన్లు సరిచేసి వీలైనంత త్వరగా వినియోగదారులకి కరెంటు పునరుద్ధరణ చేయటానికి వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వరరావు, ఏడీఈ రామకృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పొంగులేటి అండ



మృతుని కుటుంబానికి నగదును పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

నేలకొండపల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థికంగా ఆదుకుంటున్నారని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కొడాలి గోవిందరావు చెప్పారు. మండలంలో ఇటీవలి కాలంలో వివిధ కారణాలతో మృతి చెందిన 32 కుటుంబాలకు బుధవారం ఒక్కొక్కరికీ రూ.10వేలను స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. అనంతరం గోవిందరావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి జిల్లాను ముఖ్యంగా పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో గోళ్ల శ్రీనివాసరావు, బొడ్డు బొందయ్య, కుక్కల హనుమంతరావు,, సైదులు తదితరులున్నారు.

సీపీఐ వందేళ్ల వేడుకలపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ జిల్లా నాయకుడు రమేష్

రఘునాథపాలెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హలో కామ్రేడ్.. ఛలో ఖమ్మం నినాదంతో సీపీఐ పార్టీ వందేళ్ల వేడుకలపై రఘునాథపాలెం మండలంలో బుధవారం విస్తృతంగా ప్రచారం కల్పించారు. సీపీఐ జిల్లా నాయకుడు చింతల రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీల్లో నాయకులు బృందాలుగా పర్యటించారు. డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను లక్షలాది మంది పార్టీ శ్రేణుల నడుమ జరుగుతుందని, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. దేశ చరిత్రలోనే అత్యధిక ప్రజలతో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జూల వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గాడిచర్ల సత్యనారాయణ, విష్ణుమూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి సోషల్ వెల్ఫేర్ గురుకులాల జోనల్ క్రీడలు

వైరా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలల 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలను ఈనెల 6నుంచి 8వతేదీ వరకు వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఈ గురుకులాలకు చెందిన అండర్-14, అండర్-17, అండర్-19విభాగాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక

సత్తుపల్లిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా తిప్పారపు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 4వ తేదీన సత్తుపల్లిలో నిర్వహించిన పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గొలుసు వినయ్, శశికిరణ్, షిలార్ పాషా, సహాయ కార్యదర్శులుగా యశ్వంత్, సాధిక్, రఘు, కోశాధికారిగా కీర్తిలతో పాటు 11మంది సభ్యులను ఎన్నుకున్నట్లు ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ ప్రకటనలో తెలిపారు.

జర్నలిస్టులపై వ్యాఖ్యలు సరికాదు

ఖమ్మం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని, సమాజంలో అవినీతి వ్యతిరేకంగా, అక్రమాలకు వ్యతిరేకంగా రాసే హక్కు జర్నలిస్టులకు ఉందని ఆ హక్కును కాలరాసే హక్కు ఏ శక్తులకు లేదని సీపీఐ 28వ డివిజన్ సెక్రటరీ బియ్యాల రాజు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధర్యంలో జర్నలిస్టులపై వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛను హరించడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఏఐవైఎఫ్ యువజన సంఘం నాయకులు వరుణ్ తేజ్, దేవయ్య, కృపాకర్, హనే, ప్రభాకర్, బాబి, నాగేంద్రబాబు, సంపత్, గోపి తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు



నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వర స్వామి

కూసుమంచి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని కాకతీయుల గణపేశ్వరాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. మహిళలు ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. శివనామ స్మరణ చేస్తూ లక్ష ఒత్తులను, 365 ఒత్తులను వెలిగించారు. పెద్దసంఖ్యలో మహిళలు దీపాలను వెలిగించడంతో ఆలయ ప్రాంగణం వెలుగులతో కార్తీకశోభ సంతరించుకుంది. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో శివలింగాన్ని పూలతో అందంగా అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూసుమంచి మండలంలోని పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పూజలు చేశారు. అదేవిధంగా గంగమ్మ తల్లి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కూసుమంచి గణపేశ్వరాలయంలో పలువురు ప్రముఖులు మహాశివునికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి దేవినేని రామప్రసాదరావు దంపతులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తల్లిదండ్రులు మనోహర్, జ్యోతి, విశ్రాంత డీసీపీ సాధు ప్రతాపరెడ్డి ఇంకా పలువురు అధికారులు పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రేల ప్రదీప్ రెడ్డి, ఈవో శ్రీకాంత్, సభ్యులు వీరబాబు, తిరుపతిరావు, రెడ్య తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్తరేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, శ్రీవైద్యనాధ స్వామి దేవాలయాలు భక్తులతో ప్రధానంగా మహిళలతో కిక్కిరిసిపోయాయి. అర్చకులు శివయ్య, తాటిపాముల లక్ష్మీనర్సింహారావు, పురాణం దివాకర్‌లు పూజలు నిర్వహించారు. రాజేశ్వరపురం శివాలయంలో అర్చకుడు కాండూరి నర్సింహాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పైనంపల్లి శివాలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పలు ప్రాంతాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలు బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాకరవాయి, బీరోలు, పాతర్లపాడు, తిరుమలాయపాలెం, జల్లేపల్లి, సుబ్లేడు, పిండిపోలు, వీరకాశీపట్నం తదితర ప్రాంతాల్లో పూజలు నిర్వహించారు. అలాగే జల్లేపల్లిలో స్వయంభూ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ జగదీష్ ప్రారంభించారు.

జీళ్లచెరువులో కనులవిందుగా తెప్పోత్సవం

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా ఊరచెరువులో స్వామివారి తెప్పోత్సవం వైభవంగా కనులవిందుగా జరిగింది. సీతారామచంద్రస్వాముల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి తెప్పలో ఉంచి అర్చకుల వేద మంత్రోచ్ఛారణ నడుమ నదిలో ఘనంగా ఊరేగించారు. ఆలయ ప్రధానఅర్చకులు శ్రీమన్నారయణచార్యులు, సాయిరామ్, స్వామినాధ్, పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ నాగలక్ష్మి, అంబాల వెంకటలక్ష్మి, ఈవో జగన్మోహన్‌రావు, జీవన్‌రెడ్డి, ఇంటూరి పుల్లయ్య, అంజయ్య, తదితరులున్నారు.

ఖమ్మంఖానాపురంహవేలి: కార్తీక మాసంలో అత్యంత ముఖ్యమైన జ్వాలా తోరణం మహోత్సవం బుధవారం రాత్రి నగరంలోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, కైకోండాయిగుడెం రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలలో వైభవంగా నిర్వహించారు. ఆ జ్వాలాతోరణం కింద నుంచి ముందుగా ఉత్సవ మూర్తులను అనంతరం భక్తులు దాటి స్వామి వారిని దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కూసుమంచి శివాలయంలో పూజల్లో పాల్గొన్న కలెక్టర్ తల్లిదండ్రులు మనోహర్, జ్యోతి



పూజలు నిర్వహించిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి రామప్రసాదరావు



కూసుమంచిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అధికారులు



కూసుమంచిలో...



ఖమ్మంలో....



నేలకొండపల్లిలో...



తిరుమలాయపాలెంలో..

వరి రైతుల అరిగోస

» చేతికందే పరిస్థితి లేని రెక్కల కష్టం » నేలవాలడంతో హార్వెస్టర్‌కు రాని వరి



పెరికశింగారంలో నేలవాలిన వరిని హార్వెస్టర్‌తో కోస్తున్న దృశ్యం

కూసుమంచి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వరి పంట చేతికందేవేళ వరి రైతులు అరిగోస పడుతున్నారు. అకాలవర్షాలు, గాలుల కారణంగా సాగర్ ఆయకట్టులో వరి మొత్తం నేలవాలింది. భారీ వర్షాలు కురవడంతో వరి నేలకు కరుస్కుపోయింది. దీంతో కోత కోసేందుకు రావడంలేదని రైతులు ఆందోళన చెం దుతున్నారు. అదేవిధంగా వీల్ హార్వెస్టర్లు పొలంలో దిగబడుతుండటంతో చైన్ యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది. వరి నేలవాలడం, దిగబడుతుండటంతో పొలం కోసేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతోంది. ధరసైతం పదిశాతం వరకు పెంచారు. ఇందుకు గంటకు మూడువేల వరకు వసూలు చేస్తున్నారు. మళ్లీ తుఫాను వస్తుందేమోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రెక్కల కష్టం చేతికందని పరిస్థితులున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

● నాగేశ్వరరావు, రైతు, పెరికశింగారం

ఐదెకరాల్లో వరి సాగుచేశారు. ఎకరాకు సుమారు రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టాను. మొన్న వర్షాలకు వరి ఎన్నడూ లేనివిధంగా వరి నేలవాలి కరుస్కుంది. హార్వెస్టర్లకు సైతం రావడంలేదు. చైన్ హార్వెస్టర్ దొరకడం లేదు. ఈలోగా మొలకెత్తే అవకాశం ఉంది.

టీకాతోనే రక్షణ

» వాక్సినేషన్ జిల్లా మేనేజర్ రమణ

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చిన్నపిల్లలకి విధిగా టీకాలు వేయించాలని జిల్లా వాక్సిన్ మేనేజర్ సీహెచ్ రమణ తెలిపారు. బుధవారం ఖమ్మం పట్టణంలోని ముస్తాఫనగర్, శ్రీనివాసనగర్, వెంకటేశ్వరానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహించిన టీకా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బిడ్డకు ప్రథమ టీకా తల్లి ముర్రు పాలు అని, ప్రతి బాలింత విధిగా తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. టీకాలే చిన్నారులకు ఆరోగ్య రక్షగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రమేష్, డాక్టర్ సమీరా, ఫార్మసిస్ట్ పద్మజ, రజిత పాల్గొన్నారు.



టీకాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ రమణ

వరి పంట నష్టంపై సర్వే



వరి పంట నష్టంపై సర్వే చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కల్లూరు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్‌తో కురిసిన వర్షాలతో వరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ తరుపున కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో వరి పంట నష్టంపై ఏవో రూపాతో పాటుగా పలు గ్రామాల్లో ఏఈఓలు ఈ సర్వేను క్షేత్ర స్థాయిల్లో సందర్శించారు. మండలంలోని ఎర్రబోయినపల్లి, రఘునాథబంజర, తదితర గ్రామాల్లో వరి పంట నష్టం జరిగింది. ఈదురు గాలికి పూర్తిగా నేల వాలిన వరి, కల్లాల్లో అరబెట్టిగా పూర్తిగా తడిసిన ధాన్యం రాశుల వివరాలను వ్యవసాయశాఖ తరుపున సర్వే చేసి తగిన నివేదికను సిద్ధం చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

ఏన్కూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూతక్కలింగన్నపేట గ్రామంలో మంగళవారం రాత్రి ఘనంగా అయ్యప్ప పడిపూజ కార్యక్రమంనిర్వహించారు. ఈసందర్బంగా అయ్యప్ప మండపంతోపాటు18మెట్లు అలంకరించారు. గురుస్వామి బండారు కేశవస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పకు పూజలు నిర్వహించారు.

వ్యర్థాలను తొలగించరూ..

» వరదల సమయంలో డ్రైయినేజీల ధ్వంసం
» రహదారుల వెంట గుట్టలుగా మారిన వ్యర్థాలు, రాళ్లు
» విపత్తుల తర్వాత పట్టించుకోని అధికారులు



రాపర్తినగర్ సెంటర్, కొత్త బస్టాండ్ ఎదుట రహదారిపై ఉన్న వ్యర్థాలు, మట్టి



ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ అధికారుల తీరుతో ఖమ్మంలోని బైపాస్ ప్రాంతాల్లోని కమర్షియల్ వ్యాపారుల నుంచి నివాసాల్లోని ప్రజల వరకు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పని విదానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం రావడం డ్రైయినేజీల్లోని వ్యర్థాలను బయటకు తీయటం వాటిని పక్కన పడేయటం తిరిగి వర్షాలు రావడంతో అదే వ్యర్థాలు తిరిగి కాల్వలో కల్వటం పరిపాటిగా మారింది.

వరద కాల్వగా మారుతున్న బైపాస్ రోడ్డు

ఖమ్మం నగరంలో వర్షం కురిసిన ప్రతీసారి కొత్త బస్టాండ్ నుంచి రాపర్తినగర్ సెంటర్ వంతెన వరకు వరద నీరు చేరి వరద కాల్వగా మారుతోంది. ఈ రహదారి జాతీయ రహదారి కావటంతో ఏపీ, ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన వాహనాలు సైతం ఇదే రహదారి నుంచి ప్రయాణం సాగిస్తున్నాయి. రమణగుట్ట, కొత్త బస్టాండ్, శ్రీశ్రీ హోటల్ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వరద నీరు రాపర్తినగర్ రోడ్డుకు చేరుతోంది. అయితే వరదలు వచ్చిన ప్రతిసారి డ్రైయినేజీలను పగలగొట్టి నీరు వెళ్లేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. వరద నీరు వెళ్లిన తర్వాత ఆయా వ్యర్థాలను అక్కడ నుంచి తొలగించడం లేదు. వారం పది రోజులైనా అక్కడే నిల్వ ఉంచుతున్నారు. కమర్షియల్ రద్దీ ప్రాంతం కావడంతో వ్యాపారుల నుంచి సాధారణ ప్రజల వరకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తిరిగి వర్షాలు పడగానే అదే వ్యర్థాలు తిరిగి కాల్వలోకి చేరి మళ్లీ డ్రైయినేజీలు ముసుకుపోతున్నాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఎంసీ అధికారులు తక్షణమే డ్రైయినేజీలు, వంతెనలోని వ్యర్థాలను తొలగించాలని కొరుతున్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



కారేపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



వేంసూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఏన్కూరులో కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



జమలాపురంలో కార్తీక దీపాలతో వెలుగుతున్న శ్రీవారి కోనేరు

వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దీపాలు వెలిగించిన మహిళలు ఒక్కపొద్దులు ఉండి సాయంత్రం వేళ మరలా ఆలయాలకు చేరుకుని దీపాలను వెలిగించారు. ప్రధాన ఆలయాలు కార్తీకదీపాలతో విరజిమ్మాయి. అలాగే ఉసిరి, తులసి చెట్ల వద్ద దీపాలు వెలిగించడంతో పాటు మహిళలు తులిసవ్రతాలను నోముకున్నారు. ఈ సందర్భంగా తల్లాడలోని గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం(శివాలయం)లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే ప్రధాన అర్చకుడు కందల సతీష్‌శర్మ స్వామివారికి పంచామృత నవరస రుద్రాభిషేకాలు నిర్వహించారు. అలాగే ముదిగొండలోని ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం వద్ద స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. వేంసూరు శివాలయంలో వేలాదిమంది మహిళా భక్తులు జ్వాలాతోరణం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను పల్లకిలో ఉంచి జ్వాలాతోరణం కింద నుంచి ప్రదర్శన చేశారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



వైరాలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



తల్లాడ శివాలయంలో పోటెత్తిన భక్తులు



కల్లూరు వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సత్తుపల్లిలోని వెంగళరావునగర్ శివాలయంలో భక్తుల పూజలు



ముదిగొండ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కలెక్టరేట్ తరహాలో .. ఇకపై సమీకృత సేవలు

- డిప్యూటీ సీఎం భట్టి మార్కు అభివృద్ధి విజన్
- రూ.18.25 కోట్ల నిధులు మంజూరు
- ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించడమే ధ్యేయం



సమీకృత సేవల కోసం నిర్మించనున్న భవన స్థలం ఇదే

బోనకల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల పలు కార్యాలయాలు ఉండడంతో ప్రజలు మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి సేవలు పొందడం కష్టతరంగా ఉండేది. ఆ తరువాత జిల్లా కలెక్టరేట్‌లోనే ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని నిర్మించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అక్కడకు మార్చి సేవలందిస్తున్నారు. అదే తరహాలో మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో కూడా ఇక నుంచి ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని నిర్మించేలా డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క ప్రతిపాదనలు చేశారు. నియోజకవర్గంలో మరో రెండు చోట్ల కూడ ఇదే రీతిలో భవన నిర్మాణాలను చేపట్టే విధంగా నిధులు మంజూరు చేశారు. బోనకల్ మండలంలో నిర్మించనున్న సమీకృత భవన సముదాయానికి రూ.18.25 కోట్ల నిధులను మంజూరు చేశారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు రెండు అంతస్తుల భవనాన్ని అన్ని శాఖల కార్యకలాపాలు నిర్వహించడానికి అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో భవన నిర్మాణ పనులను చేపట్టనున్నారు. మండల పరిషత్, రెవెన్యూ, విద్యాశాఖ, ఐకేపీ, వ్యవసాయ తదితర శాఖల కార్య నిర్వహణ ఈ భవన సముదాయం నుంచే జరగనుంది. మండలంలో 22 గ్రామాలు ఉండగా దాదాపు 43 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతిరోజు గ్రామాల నుంచి మండల కేంద్రంలో పలు చోట్ల ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందుతున్న క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి సమీకృత సేవలు ఎంతగానో ఉపయోగ పడతాయని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అన్ని శాఖల మధ్య సమన్వయంతో పాటు జవాబుదారీతనం ఉండి పారదర్శకత పెంపొందించడానికి గానూ ఇంటిగ్రేటెడ్ సేవలు దోహద పడనున్నాయి. ప్రస్తుతం మండలంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించే బదులు శాఖలన్నీ ఒకేచోట కార్యకలాపాలు నిర్వహించే విధంగా ఇంటిగ్రేటెడ్ భవనానికి భారీగా నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్కకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రామారావు కుటుంబానికి పరామర్శ

చింతకాని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావు కుటుంబాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాజ్యసభ సభ్యుడు పెనుమల్లి మధు బుధవారం పరామర్శించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామారావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. పోలీసులు మొద్దు నిద్ర వీడి హంతకులను త్వరగా పట్టుకోవాలని. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ హత్యలను మానుకోవాలన్నారు. నాయకులు మడిపల్లి గోపాలరావు, వత్సవాయి జానకిరాములు, రాచబంటి రాము, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మధు

గోమాత సకలదేవతా స్వరూపం

వైరా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సత్యసాయిబాబా గోశాలకు చింతోజు నాగేశ్వరరావు, సీత కుటుంబసభ్యులు బుధవారం ఒక గోవును దానం చేశారు. ఈ సందర్భంగా గోమాతకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. గోవు సకలదేవతా స్వరూపమని పేర్కొన్నారు. సత్యసాయి సేవసమితి అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్‌రావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, రుద్రాక్షల నర్సింహాచారి, వై.బుచ్చిరామారావు, పి.ఉపేందర్, చెరుకూరి శ్రీనివాసరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, వై.రాజారావు పాల్గొన్నారు.

పంట నష్టంపై వ్యవసాయశాఖ సర్వే

కల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్‌తో కురిసిన వర్షాలతో వరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ తరుపున కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించారు. మంగళ, బుధవారాల్లో వరి పంట నష్టంపై ఏవో ఎ.రూపాతోపాటుగా పలు గ్రామాల్లో ఏఈవోలు ఈ సర్వేను క్షేత్ర స్థాయిల్లో సందర్శించారు. ఈదురు గాలికి పూర్తిగా నేల వాలిన వరి, కల్లాల్లో ఆరబెట్టగా పూర్తిగా తడిసిన ధాన్యం రాశుల వివరాలను వ్యవసాయశాఖ తరుపున సర్వే చేసి తగిన నివేదికను సిద్ధం చేశారు. ఇప్పటి వరకు కల్లూరు మండలంలో సుమారు 200 ఎకరాల్లో వరి పూర్తిగానేల వాలి నష్టం జరిగినట్లు తెలిసింది. ఈ సర్వే కార్యక్రమలో మండలంలోని పలు గ్రామాల ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కారేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని 5వ బజారులో తాగునీటి బోరు చెడిపోయింది. చెడిపోయిన బోరుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గతనెల 13వ తేదిన తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణిలో కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే మరమ్మతులు చేయిస్తానని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన అధికారుల, పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తు బుధవారం గ్రామంలోని బోరువద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు.

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మణ్, వెంకటేష్

సత్తుపల్లిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తిప్పారపు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 4వ తేదీన సత్తుపల్లిలో నిర్వహించిన పీడీఎస్‌యూ 23వ జిల్లా మహాసభ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులుగా గొలుసు వినయ్, శశికిరణ్, షిలార్ పాషా, సహాయ కార్యదర్శులుగా యశ్వంత్, సాధిక్, రఘు, కోశాధికారిగా కీర్తిలతో పాటు మరో 11మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్లు ఆసంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాంపటి పృథ్వీ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు శ్రీనిధి విద్యార్థులు

మధిర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన మండల స్థాయిక్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరిచి నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బట్టా అంజనబాబు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఉదయశ్రీ, మౌనికలు బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్ 17 జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. నవంబరు 2 నుంచి ఖమ్మం సర్ధార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో వీరు పాల్గొని రాష్ట్ర పోటీలలో పాల్గొనేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. నవంబరు 8,9,10 తేదీలలో కొత్తగూడెం జిల్లా ఏడూళ్ల బయ్యారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీలు ప్రవీణ్ కుమార్, శివ,కరిష్మా వారినిఅభినందించారు.

అయ్యప్ప స్వాముల పాదయాత్ర

పెనుబల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన నీలాద్రీశ్వర ఆలయానికి పెనుబల్లికి చెందిన సుమారు 200మంది అయ్యప్ప భక్తులు 16కిలోమీటర్ల దూరం పాదయాత్ర ద్వారా ఆలయానికి చేరుకున్నారు. వీరికి ఆలయ మేనేజర్ రజనీకుమారి, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావుతోపాటు కమిటీ సభ్యులకు అయ్యప్పలకు స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నీలాద్రీశ్వరస్వామి ఆలయంలో భారీ సంఖ్యలో మహిళ భక్తులు దీపాలు వెలిగించారు.



పెనుబల్లి నుంచి పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప స్వాములు

బయ్యన్నగూడెంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

పెనుబల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని బుధవారం పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం గ్రామంలోని శ్రీరమాసాహిత సత్యనారాయణస్వామి ఆలయంలో 148మంది జంటలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆలయ అర్చకులు కోటి కన్యాదానం రామాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు పూజా సామగ్రిని నూజివీడుకు చెందిన కేకే.శ్రీరాంమ్మూర్తి ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

- ఏలూరు వాసి కోటపాడు సిద్ధాంతిశర్మ ఆధ్వర్యంలో

మధిర రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిర మండలం సిద్ధినేనిగూడెం(మర్లపాడు) గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఏలూరు జిల్లాకు చెందిన కోటపాడు సిద్ధాంతిశర్మ ఆధ్వర్యంలో బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శీలం వెంకటరెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

చింతకాని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన ముద్దిన్ని వెంకటి(63) మంగళవారం మృతి చెందాడు. మృతుడు గేదెల క్రయ విక్రయాలు నిర్వహిస్తుంటాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోషులను వదిలి బాధితులను వేధిస్తున్న పోలీసులు

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు దోషులను వదిలి బాధితులను వేధిస్తున్నారని, రామారావు హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు బండి రమేష్ డిమాండ్ చేశారు. ముదిగొండలో రామారావు హత్యకు నిరసనగా బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీసు యంత్రాంగం రామారావును హత్య చేసిన దోషులను అరెస్టు చేయకుండా బాధిత కుటుంబాన్ని వేధించటం సమంజసం కాదన్నారు. నిందితులను అరెస్టు చేయలేని పక్షంలో పోలీస్‌స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉండి రాష్ట్రంలో డిప్యూటీ సీఎంగా బాధ్యత పదవిలో ఉన్న భట్టి విక్రమార్క కాంగ్రెస్ గూండాలు హత్యలకు పాల్పడుతున్నా వారిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రామారావును అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఈ హత్య చేశారని, పోలీసులు వారిని అరెస్టు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు రాయల వెంకటేశ్వరరావు, మందరపు వెంకయ్య, బండి పద్మ, బట్టు రాజు, మంకెన దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, మెట్టెల సతీష్, కోలేటి అరుణ, ప్రభావతి, మందరపు పద్మావతి, కందిమళ్ల తిరుపతిరావు, కందుల భాస్కర్‌రావు, ఉపేందర్ పాల్గొన్నారు.

వైరా: ఉమ్మడి ఖమ్మంజిల్లా, ఉమ్మడి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రైతు ఉద్యమాలకు దిక్సూచిగా పనిచేసిన యోధుడు సామినేని రామారావు అని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు తెలుపుతూ ఆయనకు బుధవారం నివాళులర్పించారు. కాంగ్రెస్ గూండాల చేతిలో రామారావు అత్యంత పాశవికంగా హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. మండలంలోని విప్పలమడకలో జరిగిన రైతుసంఘం మహాసభలో రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 40సంవత్సరాలపాటు రైతుల సమస్యల పరిష్కారానికి రామారావు చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు.



ముదిగొండలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం నాయకులు

శతవసంతాల వేడుకలను జయప్రదం చేయండి

తల్లాడ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 26వతేదీన ఖమ్మంలో జరిగే సీపీఐ శతవసంతాల వేడకలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు మద్దోజు శ్రవణ్‌కుమార్ కోరారు. తల్లాడలో బుధవారం సీపీఐ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో సుదీర్ఘకాలం ప్రజల పక్షాన సమరశీల పోరాటం చేసిన చరిత్ర కలిగిన పేదల పార్టీ సీపీఐ శతవసంతాల వేడుకకు తల్లాడ మండలం వ్యాప్తంగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై ముందుకు సాగాలని కోరారు. లక్షలాది మందితో జరలపతలపెట్టిన శతవసంతాల బహిరంగసభల భారీ సంఖ్యలో కార్యకర్తలుపాల్గొనాలని కోరారు. ఈసందర్భంగా అమరవీరుల త్యాగాలను మరొక్కసారి గుర్తుచేసుకోవాలని వారి స్ఫూర్తితో నే వందేళ్లపూర్తి చేసుకునే పరిస్థితి వచ్చిందని వివరించారు. పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు అన్ని రకాలుగా సహకారం అందించి బహిరంగసభ విజయవంతం కోసం కృషిచేయాలి కోరారు రైతుసంఘం జిల్లానాయకుడు నల్లమోతు నరసింహారావు, సీపీఐ సీనియర్ నాయకుడుతమ్మారపు వెంకటేశ్వర్లు, స్వర్ణ రాయప్ప, నాగమణి, పాషా పాల్గొన్నారు.

అన్నదానానికి ఆర్థిక సాయం

సత్తుపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీ.శ.1000నుంచి క్రీ.శ.1360ల మధ్య కాకతీయుల కాలంలో ప్రతిష్ఠ కావించిన మండలంలోని కాకర్లపల్లిలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిత్యం పూజలు జరుగుతాయి. కార్తీక మాసం సందర్భంగా ఈనెల 18వ తేదీన జరుగు అఖండ అన్నసమారాధన కార్యక్రమానికి గ్రామపెద్దలు కంచర్ల బాబూరావు, శ్రీదేవి దంపతులు రూ.35,116లు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పువ్వాళ్ల ఉమా, కంచర్ల రమేష్, చల్లారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న కంచర్ల బాబూరావు

ఘనంగా ఏసుక్రీస్తు జయంతి

కొణిజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల గ్రామం పునీత అలోషియస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పాఠశాల ఆవరణలో యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలు వైరా డీన్ తనికెళ్ల విచారణ గురువులు తుంపాటి అగస్టీన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం పీఠాధిపతులు మహగణ సగిలి ప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి 2025 ఏళ్లయిన సందర్భంగా జూబ్లీ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, ఏసుప్రభువు తెలియచేసినట్లుగా క్రైస్తవులు అందరు కూడా ప్రేమ, దయ, కరుణ ఐక్యతతో మెలగాలని, ఒకరిపట్ల ఒకరు ప్రేమ, దయ పశ్చాత్తాపము కలిగి ఉండాలన్నారు. విచారణ సంఘాలను స్వయం సంపత్తిగల సంఘాలుగా అభివృద్ధి చేయడానికి తగిన మార్గాలు ఎంచుకోవాలని కోరారు. వైరా విచారణ కర్తలు ఫాదర్ మాదాసు రాజు, ఖమ్మం పీఠం కోశాధికారి ఫాదర్ సూరేపల్లి ఐజాక్, కరుణగిరి సారథులు నేత్రాసన చాన్సలర్‌ఫాదర్ జ్వనేష్, పెద్దగోపతి విచారణ గురువులు కెన్నెర రమేష్, క్రీస్తుజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కొరవి థామస్, పునీత అలోసియష్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ వేమగిరి మేరీ పాల్గొన్నారు.

హత్యారాజకీయాలు ఎవరివో ప్రజలకు తెలుసు

ముదిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హత్య రాజకీయాలు ఎవరివో ప్రజలకు తెలుసునని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు అన్నారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో బుధవారం బుచ్చిరామయ్య స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురించి మాట్లాడే అర్హత సీపీఎం నాయకులకు లేదన్నారు. చింతకాని మండలం పాతర్లపాడులో జరిగిన సామినేని రామారావు హత్య విషయం తెలిసిన వెంటనే భట్టి విక్రమార్క స్పందించి పోలీసు అధికారులను హత్య చేసినవారిని వెంటనే పట్టుకోవాలని ఆదేశించారన్నారు. హత్యకు గురైన రామారావు గ్రామంలో పార్టీలకతీతంగా గత పదిసంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. సీపీఎం నాయకులే కావాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడానికే భట్టి విక్రమార్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హత్యారాజకీయాలను అణచివేసిందని భట్టి విక్రమార్క అభివృద్ధి వైపే నడుస్తున్నారని పేర్కొన్నారు. రామారావు హత్యకు కారకులైన వారికి శిక్షపడేలా ప్రభుత్వం చట్టం ముందు ఉంచుతుందన్నారు. మందరపు నాగేశ్వరరావు, కృష్ణ, సామినేని వెంకటయ్య, మల్లెల అజయ్, ధర్మానాయక్, ఉసికల రమేష్, భద్రారెడ్డి, అజ్గర్, అంజయ్య, కందిమళ్ల వీరబాబు, రాంబాబు, తాటికొండ రమేష్, కోడె నాగేశ్వరరావు పేంద్రరావు పాల్గొన్నారు.



నేటి నుంచి సోషల్ వెల్ఫేర్ గురుకులాల జోనల్ క్రీడలు

- వైరా సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ సమత

వైరా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలల 11వ జోనల్‌స్థాయి క్రీడా పోటీలను ఈనెల 6నుంచి 8వతేదీ వరకు వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఈ గురుకులాలకు చెందిన అండర్-14, అండర్-17, అండర్-19విభాగాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ హైజంప్, లాంగ్ జంప్, చదరంగం, టెన్నీకాయిట్, హ్యాండ్ బాల్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 14పాఠశాలలు, కళాశాలల నుంచి 1190మంది విద్యార్థులు పాల్గొంటారని, ఈ పోటీలను ఈ విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ కె.శారదా ప్రారంభిస్తారని తెలిపారు.